క్లుప్తంగా

నేడు అభిషేకం

పెద్దతిప్పసముద్రం : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శివాలయంలో సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం లక్ష్మీ అమ్మ వారికి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో గురువారం ఆర్కా రీసర్చ్ దాత దిలీప్ శంకర్‌రెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. విద్యార్థులకు అనీమియా రక్త పరీక్షలు, స్క్రీనింగ్, మెటాబోలిక్ బయోమార్కర్ పరీక్షలు చేశారు. వైద్యులు గాయత్రి చౌడ, అస్రాఖాన్ పాల్గొన్నారు.

యార్డు అభివృద్ధికి కృషి

బి.కొత్తకోట : బి.కొత్తకోట మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శి వి.మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం బి.కొత్తకోట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ కార్యదర్శిగా వి.మదన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కమిటీకి రూ.41 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. కమిటీకి సంబంధించి రూ.1.60 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు

పీలేరు : ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందిన మోడల్ కాలనీకి చెందిన ఇబ్రహీం కుటుంబానికి రూ. 30 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బలరాం, ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. సభ్యులు మస్తాన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు గండికోట వెంకటేష్, సన్ముగం, సయ్యద్‌షావలి పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఆదినారాయణ

ములకలచెరువు : అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా దేవులచెరువులో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మదనపల్లెలో జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయ ఆవరణంలో దేవాదాయశాఖ ఈఓ రమణ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆగస్టు 29 నుంచి నవంబర్ 7వతేదీ వరకు రూ.6,00,563 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బింగి పాండు, ఆలయ సిబ్బంది రాజశేఖర్, పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పెద్దమండ్యం : పెద్దమండ్యం పంచాయతీ బిక్కావాండ్లపల్లెలో సీతారామలక్ష్మణ హనుమ సమేత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం విజయవాడ భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి ధార్మిక ప్రసంగం ఇచ్చారు. ప్రతి మనిషి నిస్వార్థపరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా వేద పడింతులు విగ్రహ ప్రతిష్టలో భాగంగా అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, నవగ్రహహోమం, మూలమంత్రహోమం, పుష్పాది, శయ్యాది వాసం జరిపారు.

విద్యాదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన రాము కుమారుడు రఘుపతి(39) సెంట్రింగ్ పనికోసం గురువారం కురబలకోట మండలం అంగళ్లకు వెళ్లాడు. సాయంత్రం ఓ ఇంటిలో పని చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వమే ఉచిత ఇసుక సరఫరా చేయాలి

బి.కొత్తకోట : ప్రభుత్వమే ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం బాషా, నియోజకవర్గ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈనెల 11న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలన్నారు.

బస్టాండ్‌కు వచ్చారా.. హెల్మెట్ తెచ్చారా?

ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తే బస్సు టికెట్‌కు డబ్బులే కాదు. హెల్మెట్ కూడా తెచ్చుకోండి. ఎందుకుంటే స్లాబు పెచ్చులూడి ఎప్పుడు మీద పడుతుందో తెలియదు. వర్షం వస్తే బస్టాండ్ ఆవరణమంతా చెరువును తలపిస్తుంది. డ్రైనేజీ కాలువల్లో నీరు నిలిచిపోడంతో దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండులో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి.

- మంత్రి గారూ...
  ఇది ఆర్టీసీ బస్టాండు దుస్థితి
- అడుగు పెడితే సమస్యలు స్వాగతం
- ఉరుస్తున్న భవనాలు
- అపరిశుభ్రంగా బస్టాండు ఆవరణం
- గుంతలమయంగా మారిన రోడ్లు



పెచ్చులూడిన ఆర్టీసీ బస్టాండ్ స్లాబు



గోతులమయంగా మారిన రోడ్డు

మదనపల్లె సిటీ : జిల్లాలోనే అతి పెద్ద ఆర్టీసీ -1-2 డిపోలు ఉన్న మదనపల్లె బస్టాండులో సమస్యలు తాండవిస్తున్నాయి. బస్టాండులో అడుగుపెడితే చాలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. 24 గంటలూ కిటకిటలాడే బస్టాండులో ఇటు ఆంధ్రా, అటు కర్నాటక రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల రాకపోకలు, ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. రోజు 50 వేల వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. 44 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండు శిథిలావస్థకు చేరుకుంది. రెండు డిపోల పరిధిలో సుమారు 250 బస్సులు ఉన్నాయి. రెండు డిపోలకు కలిపి రోజుకు సుమారు రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఆర్టీసీ డిపో కార్యాలయం, బస్‌స్టేషన్, వాణిజ్య దుకాణాలు, కార్గో పార్సిల్ రూములు పై పెచ్చులు ఊడిపోయి వర్షం వస్తే చాలు ఉరుస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పైపెచ్చులు ఊడి కిందపడుతున్నాయి.

ప్రయాణికులకు అవస్థలు

నిత్యం ప్రయాణికులు సంచరిస్తుండంతో ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. డిపో కార్యాలయం చుట్టూ అపరిశుభ్రం నెలకొంది. డ్రైనేజీ కాలువల్లో నీరు నిలిచిపోడంతో దుర్వాసన వెదజల్లుతుంది. డిపో ఆవరణం చుట్టూ ప్రహరీగోడ పూర్తిగా పడిపోయింది. బస్టాండులో గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ టీవీ పని చేయడం లేదు. దీంతో పాటు చిన్న టీవీలు పని చేయడం లేదు. బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. బస్సులు ఆగే చోట ఎదురుగా వాహనాల పార్కింగ్ స్టాండును బస్టాపు ముందుకు వరకు పెట్టారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్గో గది పూర్తి స్థాయిలో లేదు. దీంతో కార్గో పార్సిల్స్ కూడా ఎక్కడ పడితే అక్కడ పడవేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఆర్టీసీ-2 డిపోలో కనీస వసతులు కోసం ప్రతిపాదనలు పంపాం. భవన నిర్మాణ పనులతో పాటు బస్టాండులో రోడ్లు, ప్రహరీ గోడలు, బస్సు పేమెంట్లు, ఇతర పనులు మంజూరు చేయాలని కోరాము. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తాం.

– మూరే వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ డీఎం, మదనపల్లె.

మంత్రి గారూ బస్టాండును బాగు చేయండి

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బస్టాండు దుస్థితిని పరిశీలించి బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జిల్లా మంత్రిపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు



ఆలయ ఉత్సవ కమిటీతో దేవాదాయశాఖ ఈఓ

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం ఆలయ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ పేర్లను దేవాదాయశాఖ ఈఓ రమణ ప్రకటించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు అయ్యప్పస్వామి మాలాధారణ సీజన్ ప్రారంభం కావడంతో కార్యక్రమాలు నిర్వహణ కోసం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్పూరి సుధాకర్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, శివమూర్తి, నాగభూషణరెడ్డి, రాజభవన్ రాజు, జర్మనీరాజు, ఢంకణాచారి, శశికుమార్, ఎం.భాలకృష్ణ, జె.ప్రవీణ్, శ్రీనివాసులునాయుడు, సోమశేఖర్, మహేష్, మల్లినాయక్, హెచ్.హేమంత్,రమణరావు, ఆంజనేయులు, బి.మల్లికార్జున, అంజనప్ప, ఆనందనాయుడు, ఎంసి నరసింహులు నియమించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్చకులు కార్తీక్ దీక్షిత్ పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బాధితుడు మన్సూర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం : హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. గురువారం మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. అడుగడుగునా ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండలంలోని వెలిగల్లు, తురకపల్లె, బండమీదపల్లె, శిద్దవరం, కోటగుట్టపల్లెల్లో ద్వారకనాథరెడ్డి ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గత ఐదు సంవత్సరాల కాలంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతోందని తప్పుబట్టారు.

ఆర్థిక సాయం

సెప్టెంబరు 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాతం తీసుకుంటున్న ఎన్‌వోపల్లె పంచాయతీ పాతూరుకు చెందిన మన్సూర్‌ను ఎమ్మెల్యే కలిశారు. తీవ్రంగా గాయపడిన మన్సూర్‌కు అప్పట్లో ఎమ్మెల్యే రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందజేసిన విషయం తెలిసిందే. మరొకసారి చికిత్సల కోసం వెళ్లాలని బాధితుడు ఎమ్మెల్యేకు తెలపడంతో రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే శిద్దవరం పంచాయతీ కోటగుట్టపల్లె బస్టాప్ వద్ద ఇటీవల మృతిచెందిన ఇంటర్ విద్యార్థిని మెహతాజ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శిద్దవరం విశ్వనాథరెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మాజీ ఎంపీపీ పి.ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, విజయకుమారి, సరస్వతి, బాషా, విశ్వనాథరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మొలక సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ మొఘల్ చాంద్‌బాషా, నాయకులు సుబ్బారెడ్డి, వెలిగల్లు రవి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవి మృతిపై ఆర్డీఓ విచారణ



వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ ఎ. శ్రీనివాస్

పీలేరురూరల్ : ఎస్‌కేఆర్ ఆస్పత్రిలో అక్టోబర్ 31న కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన లక్ష్మీదేవి ఆపరేషన్ వికటించి మృతి చెందింది. లక్ష్మీదేవి మృతిపై విచారణ జరిపించాలని కుటుంబసభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రాయచోటి ఆర్డీఓ ఎ. శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ కొండయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, మదనపల్లె ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరామకృష్ణ, మదనపల్లె జనరల్ సర్జన్ డాక్టర్ రేవతి కమిటీ విచారించింది. స్థానిక ఎస్‌కేఆర్ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ పరిశీలించి, ఆపరేషన్ చేసిన వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బాధితులు, సీపీఐ నాయకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదిక జిల్లా కలెక్టర్‌కు సమర్పించి బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో శ్రీకాకుళం జట్లు సత్తా



బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ -14 బాల్ బ్యాడ్మింటన్ విజేతగా శ్రీకాకుళం జట్లు నిలిచాయి. గురువారం జరిగిన ఫైనల్స్ క్రీడల్లో బాయ్స్ అండర్ -14 విభాగంలో శ్రీకాకుళం మొదటి స్థానం, చిత్తూరు రెండో స్థానం, మూడవ స్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. అదేవిధంగా అండర్ -14 బాలికల విభాగంలో శ్రీకాకుళం మొదటి స్థానం, విశాఖపట్నం రెండో స్థానం, మూడవ స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. వీరికి స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత బహుమతులు అందజేశారు.

వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె సిటీ: తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో జరిగిన అంతర్ కళాశాల టోర్నమెంటులో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన వాలీబాల్ టోర్నమెంటులో పలమనేరు ఎంవీఆర్ డిగ్రీ కాలేజీతో విజయం సాధించి రన్నర్స్‌గా నిలిచారు. విద్యార్థులు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. గురువారం కాలేజీలో విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి, అధ్యాపకులు మెహన్‌వల్లి, జ్యోతి, ఖాజావల్లి తదితరులు అభినందించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర జట్టు సత్తా

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 హాకీ బాలుర విభాగంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సౌత్ మోపూర్‌లో జరిగిన పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మొదట లీగ్ పోటీల్లో నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల జట్లుపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్ ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖపట్టణంతో, సెమీ ఫైన్‌ల్స్‌లో వెస్ట్‌గోదావరి జట్టుపై గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ల కడపతో తలపడి 3-0 గోల్స్‌లో ద్వితీయ స్థానం నిలిచింది. వీరి గెలుపుకు కృషి చేసిన సెలక్షన్ కమిటీ, మేనేజర్ సెల్వపాండ్యన్, నరేష్ బాబు, రెడ్డిశ్రీనివాస్‌లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు వసంతవాణి, బాబు, వసంత అభినందించారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేతగా 'జ్ఞానాంబిక'



ఎస్వీయూ బాస్కెట్‌బాల్ పోటీల్లో రోలింగ్‌షీల్డ్ సాధించిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు

మదనపల్లె : ఎస్వీ యూనివర్శిటీ, తిరుపతిలో నిర్వహించిన అంతర్ డిగ్రీ కళాశాలల క్రీడా పోటీల్లో మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి, రోలింగ్ షీల్డ్ అందుకున్నారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పా టుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎస్వీయూ మైదానంలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల జట్టుపై శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు 18-12 గోల్స్ తేడాతో విజయం సాధించారన్నారు. అలాగే ఇటీవల జరిగిన హాకీ టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, పీడీ శరత్‌నాయక్ అభినందించారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



విచారిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం : దేవదాయ భూములను ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. మండలంలోని కురిజల గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయభూమి వేలంపాటలో జరిగిన ఘర్షణపై ఎమ్మెల్యే గురువారం గ్రామస్తులు, తహసీల్దార్, ఎస్‌ఐల సమక్షంలో విచారించారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు సూచించారు. అలాగే మండలంలోని ఆలయాలకు సంబంధించిన భూముల వివరాలు సేకరించి ఆక్రమణలు జరిగి ఉంటే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నిర్మలాదేవిని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌గౌడ్, చిన్నుస్వామి, సీతారామయ్య, కృష్ణంరాజు, కొండూరునారాయణరెడ్డి, మునివెంకటస్వామి, శివశంకర్, స్థానికం రాజేష్, నాగరాజ, రమణ, జావిద్, కిట్టు, మాలమహానాడు కృష్ణప్ప, బాలాజీ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

డాక్టర్ ఎం.ఎస్.రాజు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీ టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్.ఎం.ఎస్.రాజు సేవలు మరువలేనివని ఆస్పత్రి సిబ్బంది కొనియాడారు. గురువారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి బదిలీపై వెళుతున్న డాక్టర్.ఎం.ఎస్.రాజుకు ఆస్పత్రి సిబ్బంది ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్. ఎం.ఎస్.రాజు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టాక ఆస్పత్రిని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. సిబ్బందిలో క్రమశిక్షణ పెంచి, అంకితభావంతో విధులు నిర్వర్తించేలా మార్గనిర్దేశనం చేశారన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగజీవితంలో బదిలీలు సర్వసాధారణమేనని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎం.ఎస్.రాజు సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్.ప్రసాద్‌రాజు, సీనియర్ వైద్యులు గాయత్రి, బాబు, భారతి, మురళీ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ



కలకడ : క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు



పీలేరు : క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



రామసముద్రంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కలకడ : అవగాహనతోనే క్యాన్సర్‌ను నివారించవచ్చునని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు, గుట్కా, ఖైనీ, మద్యం సేవించడం వంటి అలవాట్లు క్యాన్సర్‌కు కారణమన్నారు. సిబ్బంది భారతమ్మ, వెంకటేశ్వరరావు, అశ్విని, వాణి, శారద, పల్లవి, షరీఫ్, జమీల్‌బాషా పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పీలేరు : క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరమని వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పీలేరులో శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థులతో జాతీయ క్యాన్సర్‌డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ క్యాన్సర్ రకాలు, వాటి తీవ్రత, లక్షణాలు, చికిత్స, సాధారణ స్థాయికి మించి శీరీరముపై అసహజ కణాలను (కణితి) అనుమానించి వ్యాధి నిర్ధారణలపై అవగాహన అవసరమన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానిత క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. హెచ్‌ఈ కొండయ్య, కుసుమ, రత్నం పాల్గొన్నారు.

రామసముద్రంలో ర్యాలీ

రామసముద్రం : క్యాన్సర్ నివారణపై గురువారం రామసముద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లె : క్యాన్సర్ వ్యాధిపై విజయం సాధించాలంటే స్కీనింగ్‌తో సాధ్యమని డాక్టర్ తేజస్వి, మునికుమార్ తెలిపారు. గురువారం జాతీయ క్యాన్సర్ కార్యక్రమంలో భాగంగా ఐటీఐ విద్యార్థులు, సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి ముందస్తు పరీక్షలతోనే రక్షణ పొందగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్కీనింగ్ చేసుకున్నప్పుడే వారి ఆరోగ్యం వారి చేతుల్లో ఉంటుందన్నారు. 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్ష చేసుకోవాలన్నారు. డాక్టర్లు రిచర్డ్, అమరసింహరాజు, ఐటీఐ టీఓ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రీస్కూల్ పిల్లల హాజరు పెంచాలి

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల హాజరు పెంచాలని, వారికి అందించే పోషణలో సరైన నిర్వహణ పాటించాలని ఐసీడీయస్ సీడీపీఓ సుజాత అన్నారు. మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలతో స్థానిక ఐసీడీయస్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యక్రమాలు, వాటి నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రయోజనాలపై వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మదనపల్లె : రక్తదానం ప్రాణదానంతో సమానమని శ్రీ సిద్దార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సిద్దార్థ డిగ్రీ కళాశాలలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఈ.వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ వి.గోపాల్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆపరేషనల్ మేనేజర్ మల్లికార్జున, బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ భార్గవ్ అభినందించారు.

టమాటా మండీల్లో భద్రత తప్పనిసరి

కలకడ : టమాటా మండీల్లో భద్రత తప్పనిసరి అని సీఐ గురునాథ, ఎస్‌ఐ రామాంజనేయులు అన్నారు. గురువారం కలకడ టమాటా కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మండీల్లో కొత్త వ్యక్తులు సంచరించకుండా, చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలు యూనిఫాం ధరించాలని, టమాటా మండీలకు వచ్చే వాహనాలకు కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె : సంతానం లేని దంపతులకు శని, ఆదివారాల్లో సొసైటీ కాలనీలోని శ్రీదేవి హాస్పిటల్‌లో సంతాన సాఫల్య ఉచిత పరీక్షలు, చికిత్సలకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సాయిసంహిత మోటూరి తెలిపారు. గురువారం స్థానిక శ్రీదేవి హాస్పిటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ చెన్నైకు చెందిన ప్రశాంత్ ఫెర్టిలిటీ రిసెర్చ్‌సెంటర్, మదనపల్లెకు చెందిన మారుతీ హెల్త్‌హోమ్ సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ నియామకం

మదనపల్లె : పట్టణంలోని మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి ప్రిన్సిపాల్‌గా సీనియర్ వైద్యులు శివరామకృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్‌గా గాయత్రి శ్రీ గురువారం నియామకాలు పొందారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ జమున, బదిలీపై ఒంగోలు వైద్యకళాశాలకు, మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.ఎస్.రాజు, ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సీనియర్ సర్జన్ శివరామకృష్ణను ప్రిన్సిపాల్‌గా, గైనకాలజీ విభాగం సీనియర్ వైద్యులు గాయత్రి శ్రీని మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి.

క్రీడాకారులకు చేయూత

పీలేరు : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన సీనియర్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులకు చేయూతనిస్తున్నట్లు పెద్దిరెడ్డి అవినాష్‌రెడ్డి, రాచూరి కిరణ్ తెలిపారు. గురువారం జిల్లా జట్టు క్రీడాకారులను అభినందించారు. వారు మాట్లాడుతూ నంద్యాలలో 8, 9వ తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అంజు, నరేంద్ర, మనోజ్, చరణ్, రాహుల్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పీలేరురూరల్ : మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ తువ్వపల్లెకు చెందిన బీటెక్ ఫైనలియర్ విద్యార్థి దేవేంద్ర కరెంట్‌షాక్‌తో కాళ్లు, చేతులు పోగొట్టుకున్నాడు. ఆయన్ను ఆదుకోవడానికి పీలేరు మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవేంద్రను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ రామచంద్ర, సభ్యులు శెట్టి సుబ్రమణ్యం, సురేష్, జగన్మోహన్, కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, రహత్‌బాషా, రమణ, సుధాకర్‌బాబు పాల్గొన్నారు.